# నా పరిశోధన

శ్రీ వఝ్ఝల రామనరసింహమ్

★

రెండు టేబిలు చుట్టూవున్న కుర్చీలలో నేను, రాఘవరావుగారు, ప్రసాదరావు, కూర్చుని బాతాఖానీ కొడుతున్నాము ....గదంతా సిగరెట్టుపొగ మేఘాల్లాగ అల్లుకపోయింది .... మాకుబ్చి ట ప్పా ల కి హద్దూ, అంతూలేకుండా సాగిపోతున్నాయి। ....ప్రసాదరావు ఏవో దెయ్యాల కబుర్లు చెప్తున్నాడు....నేను వాటి నన్నిటినీ "శుద్ధా భద్దాలం"టూ క్రాస్‌చేస్తున్నాను....రాఘవరావుగారు కుర్చీలో పట్టకుండా, నానా యాతనా పడుతున్నారు!.... .... .... .... ....

గోడమీద గడియారం 12 గంటలు కొట్టింది.... .... .... .... .... .... .... ....

నా చేతిలోని సిగరెట్ కేస్ కాళీ ఐపోయింది.... .... .... .... .... .... ....

అఖుదునిమిషాలవరకు నిశ్శబ్దం ఆగదిలో రాజ్యంచేసింది.... .... .... .... ....

....ఇంతలో హటాత్తుగా పక్కగది లోంచి ఏదో గొల్లు వినిపించింది.... ....

"అమ్మో!......." అంటూ కమలం పక్కగది ద్వారానికున్న కర్టెన్ తొలగించుకొని, గబగబా పరుగెత్తుకుంటూ మావద్దకి వచ్చింది....ఆమె గుండెలు గడగడ కొట్టుకుంటున్నాయి, భయంతోకూడిన ఆయాసంతో.

ఒక్కమారుగా మేం కుర్చీలలోంచి లేచాం....పాపం, రాఘవరావుగారు లేస్తూ లేస్తూ కుర్చీతోనే వెనక్కి బోల్తా కొట్టేరు.

"ఏం, కమలం? ఏమిటైంది?" అన్నాను నేను, ఆమెను కుర్చీలో కూచోబెడుతూ....

"హమ్మో!....భయమేస్తుం....ది....... అదేమిటో....దెయ్యం.....కాబోలు!..... బాబోయ్!" అంటూ బావురుమని ఏడ్చింది, అంత పిల్లాను!

"ఏమిటి? ఎక్కడ?" అని నేను తొందరగా అడిగాను,

"ఆగదిలో....". అంది కమలం వెక్కుతూ....

నేను గబగబా ఆ గదిలోకివెళ్ళాను....నా వెనకాలె ప్రసాదరావువచ్చాడు....రాఘవరావుగారు మాత్రం జంకుతూ జంకుతూ ద్వారం వద్ద తటపటాయిస్తున్నారు, రావడమా, మానడమా అని.

నేను గదంతటా పరిశీలించాను...ఏ దయ్యంలేదు....భూతంలేదు....గది గోడల నిండా మంచి మంచి పటాలున్నాయి. కమలం దేన్నిచూసి భయపడిందో నాకు బోధపడింది కాదు........

కమలం ఇంకా...ఏడుస్తున్నది....

అరఘంటాలోచించాను. ఆ దెయ్యమేవిటా అని....బుర్ర వేడెక్కింది....

గబగబా పైకివచ్చాను.......

"ఏమండీ! ఏమేనా డిటెక్టుచేశారా.... పరిశోధకులు కదా!" అన్నారు రాఘవరావుగారు, నాతో....ఆయన మొహంలో భీతి స్పష్టంగా నాకు కన్పించిందప్పుడు.

"అబ్బే! ఏమీలేదు....మీ అమ్మాయి వుత్తినే జడుసుకుంది...."అన్నాను నేను ధీమాగా।

"ఛా! నాకు పెద్ద యింత బుర్ర భయంకరంగా కనిపిస్తే...లేదంటా రేవిటి?" అంది కమల కోపంతెచ్చుకుంటూ. నాకు నిజంగా ఆశ్చర్యంవేసింది!......

రాఘవరావుగారు రాతిబొమ్మలా నిల్చుండిపోయారు.

కమలం కన్నీళ్ళుతుడుచుకుంటున్నది....

"ఏమిటి సాధనం?" అన్నారు రాఘవరావుగారు, లటుకు, లటుకు, మంటున్న గుండెతో!

"ఇంటికివెళ్ళి, ఈ రాత్రల్లా బాగా ఆలోచించి, రేపు చెప్తాలేండి" అన్నాను నేను.

"లేకపోతే మీరు డిటెక్టివు కానేకారు!" అంది కమలం, దండిస్తున్నట్టుగా।

"అలాగే లే!" అని, నేను ప్రసాదరావుతోకలిసి, ఇంటికి బయల్దేరాను.

రాఘవరావుగారు మాత్రం బితుకు బితుకుమంటూ అలాగే నిల్చుండిపోయారు నోటంట మాటలేకుండా।

*　　*　　*

ఆవేళ రాత్రంతా ఘోరంగా ఆలోచించాను....కాని ఏమీ తేలలేదు....గది గోడల మీది పటాలుచూచి భయపడ్డానికేమీ అవకాశంలేదు....అయితే....మరెందుకు భయపడింది కమలం ??

....ఆమెకు హిస్టీరియా కంప్లెయింటేమీ లేదే!

...మర్నాడు పొద్దున్న కాఫీ తాగి నేను రాఘవరావుగారింటికెళ్ళి చూసేసరికి, ఆయన 105 డిగ్రీల ఉష్ణంతో, కళ్ళుమూసుకుని మంచంమీద పడుక్కునివున్నారు. ఆయన దగ్గరే కమలంవుంది...నేను ఆత్రుతతో ఆయనను పలకరించబోతూవుంటే, కమలం "వద్దు" అని సౌంజ్ఞచేసి, నన్ను చెయ్యిపట్టుకొని, పక్క గదిలోకి తీసికెళి పోయింది ఏదో రహస్యం చెప్పడానికన్నట్లు·

"ఏమిటి సంగతి?" అన్నాను నేను.

"ఆయనకూడా దడుసుకున్నారు. ఇవాళ తెల్లారజామున చీకటి చీకటిగా వున్నప్పుడు ఆయనా గదిలోకి వెళ్ళేసరికి ఆయనకికూడా ఏదో పెద్దదెయ్యం కనిపించిందట.... అయితే ఒక్కబుర్రమాత్రమే కన్పించింది....మిగతా శరీరమేమీ కనపడలేదుట...నాకూ అలాగే .. నాకు ఆడబుర్ర కనిపించింది....ఆయనకి రాక్షసిబుర్ర కనిపించింది.... ఆగదిలోకెవరూ వెళ్ళడంలేదు...." అంది కమలం.

నాగుండెలు దడదడాకొట్టుకొన్నాయి.... నాభుజంమీద కమలం చెయ్యి గజగజావణికింది....

"నేవివాళ సాయంత్రంవరకూ మీ ఇంట్లోనేవుండి పరిశోధిస్తాను....మా యింటికి వెళ్ళను ...సాయంత్రం 7 గంటలకి తప్పకుండా యిదేమో కనిపెట్టితీరాలి...." అన్నాను నేను.

"అలాగే చెయ్యండి....నాకూ సాయంగా వుంటారు....మాయింటోనే భోంచేతురుగాని" అంది కమలం.

నేను కుర్చీలో కూచుని ఆలోచించసాగేను.

తొమ్మిది....పది....పదకొండయింది.

గబగబాలేచి, గదంతా వెతికేశాను.

విస్పృహతోవచ్చి, తిరిగి కుర్చీలో కూలబడ్డాను. పన్నెండుకి భోజనమయింది....

కారాకిల్లీ బిగించి, తిరిగి కుర్చీ నలంకరించా.

ఒంటిగంట........

రెండుగంటలు........

మూడు........

నాలుగు........

ఠక్కుమని, ఏదో ఆలోచన నాబుర్రలో మెరిసింది....వూ!....కొంచం కొంచం చీకటిలోనే ఆదెయ్యం వారికి కనిపించింది.... అయితే???....మళ్ళా ఆలోచన సాగింది కాదు....

అర్థైంది!............

చిన్న చిరుచీకటి కమ్మింది....

నేనాదెయ్యాల గదిలోకి వెళ్ళాను. అన్ని కిటికీలూమూసి, ద్వారానికున్న కర్టెన్లు వేసేశాను.....నాలుగుమూలలాచూశాను .... ఏమీ లేదే!....గోడదగ్గిరేవున్న ఉటిలవద్దకివెళ్ళి నిలబడ్డాను....అమ్మో!!....నాగుండె ఘుతుక్కుమంది. .అదేమిటి.. ఆ వికారస్వరూపం ఆగోడమీద!!! గట్టిగా అరుద్దామనుకున్నాను!

కాని...గొంతుక బిగుసుకుపోయింది...

కాళ్ళు తేలిపోతున్నాయి!

ఒక్కనిముషం గడిచింది...

ధైర్యంచేసి, దగ్గిరసా వెళ్ళాను...!

హారిదేవా!!

ఆశ్చర్యం!!...ఏమీలేదు!!!...

తెలిసిపోయింది!...పరిశోధన ఫలించింది. ఒక్కగెంతువేసి, గదిబయటకువచ్చి, "తెలిసింది!" అని గట్టిగా అరచాను.

కమలం గబగబా పరుగెత్తుకొనివచ్చింది. రాఘవరావుగారుకూడా ఆయాసపడుతూ ఆమె వెనకాలెవచ్చారు.

"ఏమిటి తెల్సింది?" అని యిద్దరూ ఒక్కమారడిగేరు,

"అంతా భ్రాంతి...రండి కావలిస్తే, మీకు మళ్ళా ఆదెయ్యాన్ని చూపిస్తాను" అన్నాను నేను—

ముగురం కలిసి, ఆగదిలోకి వెళ్ళాము కమలం, రాఘవరావుగారు, నాదెగ్గిరే వణుకుతూ నిలబడ్డారు—!

"చూడండి! ఆపటాలమధ్య" అన్నాను నేను.

"అదేమిటి? మూడు బుర్రలు కనిపిస్తున్నాయి?" అంది కమలం నా భుజాన్ని గట్టిగా రెండు చేతుల్తోను పట్టుకొని......

"మరేం భయంలేదు! మొట్టమొదట కిటికీలన్నీ తెరవండి, ఆ తర్వాత సంగతంతా చెప్తాను" అన్నాను నేను.

కమలం కిటికీలు తెరచింది.

నేను, ఆ పటాలమధ్య గోడకున్న ఒక చిన్న, పాత అద్దాన్ని బయటికి లాగాను!

"కమలం! ఈ అద్దంలో నీ ముఖం చూసుకో" అన్నాను.

కమలం భయపడుతూ ఆ అద్దాన్ని అందుకొని చూస్తూ, "ఇదేమిటి? ఇంత పెద్ద మొహం కనిపిస్తున్నది?" అంది ఆశ్చర్యంతో!

"అరె...రె...!ఇదా?.....భూతద్దం! ఎన్నాళ్ళనించివుందో అక్కడ!" అన్నారు రాఘవరావుగారు గుడ్లు మిటకరిస్తూ!

"ఆ పటాలమధ్య ఈ అద్దం పెంకు మీకు కనిపించలేదు...కాని, అందులో మీ పెద్ద ప్రతిబింబం మట్టుకు మీకు కనిపించి మిమ్మల్ని గాభరాచేసింది!" అని, నేను విప్పి చెప్పాను.

కమలం ఫక్కున నవ్వింది!....

రాఘవరావుగారు ఆనందంతో ఒక్క గెంతువేసి, పక్కనున్న కూజాను "ఢభీ" మని ఒక్క తన్ను తన్నేరు!!